# అప్పుల ఊబిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం

**ఆంధ్రప్రదేశ్** రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంక్షోభ ఊబిలో కూరుకొని వుంది. ప్రతినెలా అప్పులకోసం వెంపర్లాడుతోంది. ఏ నెలకానెల అప్పు లభించకపోతే రాష్ట్రం ఇబ్బందుల నెదుర్కొనేవిధంగా ఆర్థిక పరిస్థితి దిగజారింది. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులందరికీ సరిగ్గా సమయానికి సక్రమంగా జీతాలు ఇవ్వగలిగిన స్థితిలో లేదు. ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించేందుకు ఏపి ప్రభుత్వం బ్యాంకుల నుండి, ఇతర ద్రవ్య సంస్థల నుండి అసాధారణంగా అప్పులు చేస్తూ నెట్టుకొస్తోంది. దేశ, రాష్ట్ర పాలకులు గత 75 సం॥లుగా సామ్రాజ్యవాద అనుకూల, ఫ్యూడల్ అనుకూల పార్లమెంటరీ విధానాలనుసరించిన ఫలితమే ఈ దుస్థితి.

ఉమ్మడి రాష్ట్ర విభజనలో ఏపి రాష్ట్ర వాటా అప్పు 97,123 కోట్లుగా వుంది. గత టిడిపి ప్రభుత్వ 5 సం॥ల పాలనా కాలంలో చేసిన అప్పు 1,65,000 కోట్లు; ప్రస్తుత వైసిపి ప్రభుత్వ 2 సం॥ పాలనా కాలంలో చేసిన అప్పు 1,15,000 కోట్లు. వెరసి మొత్తం రాష్ట్ర అప్పు 3,77,123 కోట్లుగా వుంది. ఇదేకాక, వివిధ ద్రవ్యసంస్థల వద్ద, బ్యాంకుల వద్ద చేసిన అప్పులన్నీ కలిపితే 5 లక్షల కోట్లపైగా రుణభారంలో రాష్ట్ర ప్రజలున్నారు. పుట్టబోయే బిడ్డతో సహా రాష్ట్రంలోని ప్రతి ఒక్కరిపై 1,00,000 రూ॥ల అప్పు వుంది. రాష్ట్రంలోని ఈ పరిస్థితి తీవ్ర అశాంతి, ఆందోళనలను రేపుతోంది.

రాష్ట్ర ఆర్థిక సంక్షోభాన్ని దృష్టిలో వుంచుకొని కొన్ని బ్యాంకులు రాష్ట్ర ప్రభుత్వ రుణ ప్రతిపాదనలను నిరాకరిస్తున్నాయి. బ్యాంకుల, ద్రవ్యసంస్థల నమ్మకాన్ని ప్రభుత్వం కోల్పోయింది. కేవలం దొడ్డిదోవన రుణాలు పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా కార్పొరేషన్లను ఏర్పరుస్తున్నది.

కార్పొరేషన్ల పేరిట తీసుకున్న రుణం, రాష్ట్ర ప్రభుత్వ రుణ ఖాతాలో చూపకుండా రుణభారాన్ని విడగొట్టి, తగ్గించి చూపుతున్నారు. ఈ విధంగా తెచ్చిన రుణాలను కూడా వారు రూపొందించుకున్న సూత్రాలనే ఉల్లంఘించి ఖర్చు చేస్తున్నారు. రాష్ట్రం దివాళా తీస్తుండటానికి ఈ పరిణామాలన్నీ సూచికలు. వివిధ కార్పొరేషన్ల పేర్లతో అప్పులు రాష్ట్ర విభజన నాటికి 14 వేల కోట్ల రూ॥ కాగా, తర్వాత చంద్రబాబు పాలనాకాలం 5 ఏళ్ళలో ఆ రుణం 44 వేల కోట్లకు, 2 సం॥ల జగన్ పాలన కాలంలో 56,000 కోట్ల రూ॥కు పెరిగిపోయింది.

రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం రిజర్వ్‌బ్యాంకు వద్దకు ఎన్నోసార్లు ఓవర్ డ్రాఫ్ట్‌కు వెళ్ళింది. ప్రభుత్వానికి ఆదాయానికి మించిన ఖర్చులున్నప్పుడు ఓవర్‌డ్రాఫ్ట్‌కు వెళుతుంది. దీనికి వెళ్ళేముందు 'వేస్ అండ్ మీన్స్' రూపంలో రిజర్వ్‌బ్యాంకు నుండి తాత్కాలిక రుణం పొందే అవకాశముంటుంది. ఈ రుణంపై వడ్డీ రేటు, 'రెపోరేటు (రిజర్వ్‌బ్యాంకు వాణిజ్య బ్యాంకులకు ఇచ్చే రుణాలపై వడ్డీరేటు) స్థాయిలోనే వుంటుంది. 'వేస్ అండ్ మీన్స్' పరిమితి మేరకు రుణం కూడా సరిపోక, ఓవర్‌డ్రాఫ్ట్‌లకు వెళ్తున్నారు. ఈ రుణంపై వడ్డీరేటు రెపో రేటు కంటే 2 శాతం అధికంగా వుంటుంది. ఈ విధంగా అధిక వడ్డీలతో సేకరించిన నిధులు రాష్ట్ర రుణ భారాన్ని మరింతగా పెంచుతున్నాయి.

భవిష్యత్‌లో రాష్ట్రానికి సమకూరే ఆదాయాన్ని కూడా తాకట్టు పెట్టి ప్రభుత్వం రుణాలు తీసుకుంటున్నది. రానున్న కాలంలో మద్యం అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్యారెంటీగా చూపి 21,500 కోట్ల రుణం పొందింది. కలెక్టర్ కార్యాలయాలను, వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను ఇతర ఆస్తులను కూడా ప్రభుత్వం తాకట్టు పెడుతోంది. విద్యుత్తు రంగానికి చెందిన 14,000 కోట్ల ఆస్తులను తాకట్టు పెట్టారు. ప్రతినెలా రాష్ట్ర ప్రభుత్వం 4,500 కోట్లు అప్పులకు వడ్డీలు, పాత రుణాల కిస్తీలు చెల్లించాల్సి వస్తోంది. రాష్ట్రం రుణాల వుచ్చులో చిక్కుకుంది. ఇదొక పెట్టుబడిదారీ విషవలయం.

అలాగే గత, ప్రస్తుత ప్రభుత్వాలు సెక్యూరిటీ బాండ్ల వేలంలో పాల్గొని నిధులు సమకూర్చుకుంటున్నాయి. ఈ మొత్తాలు 'ఎఫ్ఆర్‌బిఎమ్' చట్టం పరిధిలోకి రావు. (రాష్ట్రాల వ్యయాలు వాటి ఆదాయం కంటే అధికంగా వుండటాన్ని అదుపుచేసే చట్టం – ఫిస్కల్ రెస్పాన్స్‌బిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్ – ఎఫ్ఆర్‌బిఎం – చట్టం) కనుక ఈ రుణాల భారం రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో కనబడదు. కానీ ఈ బాండ్ల పైన కూడా ప్రభుత్వం అసలు, వడ్డీ చెల్లించాలి.

విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 14వ ఆర్థికసంఘం సిఫార్స్ మేరకు 5 సం॥ల కాలవ్యవధిలో ఆదాయ లోటు నిమిత్తం గ్రాంటుగా చెల్లించవలసిన 22,113 కోట్ల రూ॥ నిధుల విడుదల సక్రమంగా జరగలేదనే వాద వివాదాలున్నాయి. ఏమైనా జిఎస్‌టి ఉనికిలోకి వచ్చాక, రాష్ట్రాల ఆదాయంలో సింహభాగం కేంద్రం చేతుల్లోకి వెళ్తుంది. ఆపై కేంద్రం తిరిగి రాష్ట్రాలకు వాటాల ప్రకారం నిధులను పంపిణీ చేస్తుందని చెబుతున్నా, రాష్ట్రాలను నియంత్రించటానికి కేంద్రం ఈ అధికారాన్ని తన చేతుల్లో వుంచుకొని వ్యవహరిస్తోందనేది వాస్తవం.

2020-21లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థూల ఉత్పత్తి మొత్తం (జిఎస్‌డిపి) 10,61,902 కోట్లుగా అంచనా వేశారు. 2021-22లో అంటే ఈ ఆర్థిక సంవత్సరం ఇందులో నాలుగుశాతం (42,472 కోట్ల రూ॥ వరకూ) రుణం పొందటానికి అవకాశముంది. కొన్ని ఖాతాల వివరాలు సక్రమంగా అందించని కారణంగా కేంద్రం దీనిలో 5,309 కోట్ల రూ॥ కోత విధించటంతో, ప్రస్తుత ఆర్థిక సం॥రంలో సమీకరించుకోగల రుణపరిమితి 37,163 కోట్లుకు తగ్గింది. అప్పులు చేసైనా పాత రుణాలు చెల్లించడంతో 14,429 కోట్ల వరకూ అదనంగా అప్పుచేసే అవకాశం పెరగటంతో, ఆంధ్రప్రదేశ్ అప్పుల పరిమితి మొత్తంమీద ఈ సం॥రం 51,592 కోట్లకు చేరుకుంది.

కాగా, గత సంవత్సరం పరిమితికి మించి అప్పులు చేయడంతో మొత్తం 23,923 కోట్లమేర కేంద్రం కోత విధించింది. దీనితో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం అప్పుల పరిమితి 27,688 కోట్లకు తగ్గిపోయింది. బడ్జెట్ అంచనాలను మించి 153 శాతం అధికంగా అప్పులుంటున్నాయని, ప్రతి వంద రూ॥ల్లో 45 రూ॥లు అప్పు ద్వారా సేకరించినదేనని 'కాగ్' నివేదిక ఎత్తిచూపింది. ద్రవ్యలోటును రాష్ట్ర స్థూల ఆర్థికవృద్ధిలో 3 శాతానికి మించకుండా చూసుకోవాలనే నిబంధన వుండగా, ఏ.పి. ద్రవ్యలోటు దానికి ఎన్నోరెట్లు అధికంగా కనిపిస్తోందని 'కాగ్' వ్యాఖ్యానించింది.

సంక్షేమ పథకాలపేరున, మోసపూరితంగా రాబోయే ఎన్నికలలో ఓటు బ్యాంకును గ్యారంటీ చేసుకునేందుకు నిర్దిష్ట సామాజిక సమూహాలకు పింఛన్లు, రాయితీల పేరున రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక్ష నగదు బదిలీకి ప్రాధాన్యతనిస్తోంది. ఇది ఏవిధంగానూ రాష్ట్ర ప్రజల అభివృద్ధికి దోహదపడేదిగా లేదు. ప్రస్తుత బడ్జెట్‌లో నీటిపారుదల ప్రాజెక్టులకు 13,000 కోట్ల రూ॥ కేటాయించారు; అయితే వాస్తవంగా దానికి ఖర్చు చేసింది శూన్యం. అప్పులు తీర్చటానికే అప్పులు చేస్తూండటంతో, ప్రజోపయోగ ప్రాజెక్టులేవీ ముందుకు సాగక, ప్రజలు అవస్థలనెదుర్కొంటున్నారు. ముఖ్యంగా గత రెండు సంవత్సరాలుగా కోవిడ్ సంక్షోభం ప్రజా జీవితాలను అతలాకుతలం చేస్తోంది. ఈ సమయంలో మరింతగా ప్రజలను ఆదుకోవలసిన పాలకులు ఎడాపెడా ప్రజలపై పన్నులభారాలు పెంచి, ఖజానా నింపుకుంటున్నారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, విద్యుత్ ఛార్జీలతోపాటు నిత్యావసర వస్తువుల ధరలు పెనుభారమవుతున్నాయి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా వున్న కాలం నుండి రాష్ట్రాన్ని పరిపాలించిన కాంగ్రెస్, టిడిపి, ప్రస్తుత వైసిపిలు దళారీ పెట్టుబడిదారులకు ప్రాతినిధ్యం వహించే పార్టీలు. స్వతంత్ర దేశీయ విధానాలకు తిలోదకాలిచ్చి సామ్రాజ్యవాదుల, భూస్వాముల ప్రయోజనాలకు అనుగుణమైన విధానాలను ఇవి దశాబ్దాల కాలంగా అమలుచేస్తూ వస్తున్నాయి. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో ఉత్పత్తిని పెంచే నిజమైన అభివృద్ధికర విధానాలను వీరు అమలు చేయటం లేదు; చేయరు. వీరు 'దున్నేవానికే భూమి'ని పంపకం చేయరు; సరైన సాగునీటి సౌకర్యం కల్పించరు; జాతీయ పరిశ్రమలను స్థాపించరు. దేశానికి ప్రధానమైన వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను పూర్తిగా దోపిడీవర్గాలకు ధారాదత్తం చేస్తున్నారు. ఫలితంగా నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, పేదరికం పెరిగిపోతోంది.

మరోవైపున ప్రజల సంపద, వనరులన్నీ సామ్రాజ్యవాద దేశాలకు తరలి వెళ్ళిపోతున్నాయి. దేశం, రాష్ట్రం నానాటికీ అప్పుల ఊబిలో కూరుకుపోతూ దివాళాతీసేలా ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక దుస్థితి, ఈ సంక్షోభంలో భాగమే. భూస్వామ్య, సామ్రాజ్యవాద, దళారీ దోపిడీవర్గాలకు వ్యతిరేకంగా నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమ నిర్మాణమే దీనికి ఒకే ఒక్క సరైన ప్రత్యామ్నాయం.

'తాకట్టులో భారతదేశం' రెండవ ముద్రణకు ముందుమాటలో కామ్రేడ్ టి.ఎన్.ను ఉటంకిస్తూ కా॥ జస్వంత్ ఇలా విశ్లేషించారు : "భారత బడా బూర్జువావర్గం విప్లవానికి ఎలా ద్రోహం చేసిందో, వలసపాలన నాటికంటే తీవ్రమైన పద్ధతిలో విదేశీ ద్రవ్యపెట్టుబడి దోపిడీకి ఎలా అనుమతి ఇచ్చిందో, ఫ్యూడల్ భూస్వాములతో రాజీపడి పెరుగుతున్న పెట్టుబడిదారీ సంబంధాలతోపాటు ఫ్యూడల్ దోపిడీని సైతం తీవ్రం చేయటానికి ఎలా తోడ్పడిందో కా॥ టి.ఎన్. వివరించారు. తత్ఫలితంగా ఫ్యూడల్ భూస్వామ్యవర్గంతో పాటు విప్లవ ప్రతీఘాత వర్గంగా ఎలా రూపొందిందో వివరించారు. ఈ పరిస్థితుల్లో శ్రామికవర్గం మాత్రమే భారత ప్రజాతంత్ర విప్లవానికి నాయకత్వం వహించగల్గుతుందని ఘంటాపథంగా ప్రకటించారు."